క్లుప్తంగా

సీఎంను కలిసిన నాయకులు


సీఎంతో నాయకులు, మంత్రి పొంగులేటి

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంకు చెందిన కాంగ్రెస్ నాయకులను శుక్రవారం హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు వారు సీఎం కలవగా.. అసెంబ్లీ, ఎంపీ, ఎమ్మెల్సీతో సింగరేణి ఎన్నికల్లో పార్టీ నాయకులు విజయానికి కృషి చేయడంపై అభినందించారు. సీఎంను కలిసిన వారిలో ఆళ్ల మురళి, త్రివేది ఉన్నారు.

తై బజార్ వేలానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: పురపాలక సంఘం పరిధిలో రోడ్డు పక్కన కూరగాయలు తదితర విక్రయాలకు తై బజార్ 2024–25 సంవత్సరానికి హక్కును ఓపెన్ ఆక్షన్ ద్వారా పొందుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు కమిషనర్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వరకు రూ.10 వేలు డీడీ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రూ.3.50 లక్షలు ధరావత్ సొమ్ము కమిషనర్ పేరుతో డీడీ తీసి అందజేయాలని, వివరాలకు 9666333359 నంబరులో సంప్రదించాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

టేకులపల్లి: విద్యార్థులు ప్రతీరోజూ దినచర్యలో భాగంగా తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి కందుల దినేష్ తెలిపారు. సులానగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. మాట్లాడుతూ... మిగిలిపోయిన ఆహార పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం ద్వారా ఈగలు పెరిగే అవకాశం ఉందని, డస్ట్ బిన్‌లో వేయడం అలవాటు చేసుకోవాలన్నారు.

ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

ఇల్లెందురూరల్: ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం ఇవ్వదలిచిన రైతు భరోసాను వెంటనే రైతుల అకౌంట్లలో జమ చేయాలని బీఆర్ఎస్ మండలశాఖ మాజీ అధ్యక్షుడు ఆజ్మీర భావ్‌సింగ్ డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ, తహసీల్దార్ కార్యాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో రైతు బంధును జమ చేసిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో రైతు భరోసాను రూ.15వేలకు పెంచుతామని ప్రకటించడంతోపాటు కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తామని హామీ ఇచ్చి నేడు అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎస్సీ ఇండస్ట్రీస్ 2018–2022 వరకు ఉన్న సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, దళితవాడల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు దళితులకే ఉచితంగా ఇవ్వాలని, ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రత్నకుమారి, జోసెఫ్, వీరన్న, చిరంజీవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు 'సంక్షేమం' అందించండి..


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయాలని సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.శాంతారామ్ మాట్లాడుతూ... నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి 250 గజాల ఇంటిస్థలం, పెన్షన్, హెల్త్‌కార్డులు, బస్సుపాస్‌లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కొంత మంది తాము ఉద్యమకారులమంటూ బోగస్ వాళ్లు ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి నకిలీలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గెర్షోము, అనంతరెడ్డి, సూర్యప్రకాశరావు, దాచేపల్లి వెంకటేశ్వర్లు, సత్తార్, వెంకటయ్య పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తం

- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- దోమల నివారణతోనే వ్యాధులకు దూరం


రుద్రంపూర్‌లో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది


చుంచుపల్లిలోని ఓ వీధిలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

చుంచుపల్లి: వ్యాధుల సీజన్ మొదలైంది. నైరుతీ రుతుపవనాల ప్రభావంతో ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. దోమల దండయాత్రతో పాటు తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డయేరియా, మెదడువాపు లాంటి అనేక వ్యాధులు ఇబ్బంది పెడతాయి. ఇప్పటికే అక్కడక్కడా డెంగీ, మలేరియా జ్వరాలు కూడా ప్రబలుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

దోమల ద్వారా పలు వ్యాధులు:
సీజనల్ వ్యాధుల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు. రెండు తాగునీరు కలుషితం కావడం వలన వచ్చే వ్యాధులు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికున్ గున్యా, బోదకాలు. తాగునీటి కలుషితం వల్ల వలన టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వంటి వ్యాధులు ప్రబలుతాయి.

డెంగీ జ్వరం: ఇది ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు ద్వారా సోకుతుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమైన జ్వరం వస్తుంది. తలనొప్పి, కంటిలోపల కదలికలు తగ్గుట, కండరాలు, కీళ్లనొప్పులు ఇబ్బంది పెడతాయి. నోరు ఎండిపోవడం, వాంతి వచ్చినట్లు ఉండడం, చర్మంపై కందినట్లు ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ఈ జ్వరంతో కొందరికి ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. ఆందోళన చెందకుండా వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలి, సొంత చికిత్స ప్రమాదకరం.

మలేరియా: అనాఫిలిస్ అనే ఆడదోమ వలన మలేరియా సోకుతుంది. జూలై నుంచి డిసెంబర్ వరకు ఎక్కువగా మలేరియా ప్రబలుతుంది. వర్షాకాలంలో నీటి నిల్వ ఉండే ప్రదేశాలలో ఈ దోమలు పెరుగుతాయి. దోమ కాటు వేసిన రెండు వారాల తరువాత చలి జ్వరం, తలనొప్పి వస్తుంది.

టైఫాయిడ్ : ఇది తాగునీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా వస్తుంది. జ్వరం వస్తూ పోతుంటుంది. ఆకలి మందగిస్తుంది. కొంతమందిలో వాంతులు అవుతాయి. మూడు రోజులు తరువాత రక్త పరీక్షలలో టైఫాయిడ్ పాజిటివ్ వస్తుంది. సొంత వైద్యం చేసుకోకుండా ఆస్పత్రికి వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి.

హెపటైటిస్ (కామెర్లు): వర్షాకాలంలో ఎక్కువగా సోకే వ్యాధి పచ్చకామెర్లు. కలుషితమైన నీరు, ఆహారం, మద్యం అలవాటు ఉన్న వారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయంలోకి ప్రవేశించడంతో కామెర్ల వ్యాధి వస్తుంది. కామెర్లు సోకగానే కళ్లు పసుపు పచ్చగా మారతాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

డయేరియా: వర్షాకాలంలో వచ్చే వ్యాధులలో ప్రధానమైనది విరేచనాలు. ఇది కూడా కలుషిత ఆహారం, నీరు వలన వస్తుంది. విరేచనాలతోపాటు వాంతులు కూడా అవుతాయి. శరీరంలోని నీరంతా పోవడం వలన మనిషి నీరసపడిపోతారు. ఒక్కోసారి డీ హైడ్రేషన్‌కు గురవుతారు. విరేచనాలు మొదలైన వెంటనే వీలైనంత త్వరగా సమీపంలోని వైద్యశాలకు వెళ్లాలి.

దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు...
దోమలు ప్రధానంగా మురుగు నీరు నిల్వ ఉన్న చోట పెరుగుతాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లు పెడతాయి. అవి లార్వాగా మారతాయి. ఇవి ఇంట్లోని కూలర్లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, రుబ్బురోళ్లు తదితర వాటిలో దోమలు పెరుగుతాయి. దోమలను, లార్వాలను నాశనం చేయాల్సిన అవసరం ఉంది. ప్రతీ 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే మట్టితో పూడ్చాలి. వీలుకాని పక్షంలో పెద్ద పెద్ద కుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తారని వైద్యశాఖ అధికారులు తెలిపారు. డెంగీ, మలేరియా జ్వరాలు కేవలం దోమల ద్వారా మాత్రమే సోకుతాయి. దోమలు పుట్ట కూడదు, దోమలు కుట్టకూడదు అనే నినాదంతో ముందస్తు జాగ్రత చర్యలను సూచిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రజలలో అవగాహన కల్పించాలి. దోమలను తరిమేసేందుకుగాను ప్రతీ పంచాయతీల్లో ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. వాటి పనితీరును పరిశీలించుకోవాలని, ఎంతవరకు పనిచేస్తున్నాయో చూసుకోవాలని అధికారులు ఆదేశాలిచ్చారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి...



జ్వరం, వాంతులు, విరేచనాలు లాంటివి కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి. ఎవరైనా సరే ఎలాంటి అనారోగ్య కారణాలు కనిపించినా సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుడిని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– నేహా ఆంబ్రీన్, వైద్యాధికారి, పెనగడప

సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం..



వర్షాకాలం నేపథ్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశాం. సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశాలిచ్చాం. గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోజు విడిచి రోజు ఫాగింగ్ చేయాలని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందికి సూచించాం.

– జి.సత్యనారాయణ, ఎంపీఓ, చుంచుపల్లి

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవి శుక్రవారం తెలిపారు. కొమరారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామపంచాయతీల ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బీఎంఎస్ ఏరియా కమిటీ ఎన్నిక


రవికుమార్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా బీఎంఎస్ ఉపాధ్యక్షుడిగా మొగిలిపాక రవికుమార్ తిరిగి ఎన్నియ్యారు. అలాగే కార్యదర్శిగా విత్తనాల నాగప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా గంధం సతీష్, డి.రవి, పిల్లి భరత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వి.రామకృష్ణ, మల్లారెడ్డి, బి.శంకర్, ఐత రవి సహా పలువురిని శుక్రవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నామని సంఘం కార్యదర్శి పి.మాధవనాయక్ తెలిపారు.

మావోలకు వ్యతిరేక పోస్టర్లు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మావోయిస్టులకు వ్యతిరేక వాల్ పోస్టర్లు వెలిశాయి. రైల్వేస్టేషన్ సెంటర్ మొదలుకొని ఓల్డ్ డిపో సెంటర్ వరకు పోస్టర్లు కనిపించాయి. ఆదివాసీలకు ఇబ్బంది పెడుతున్న మావోయిస్టులు హింసాత్మక ఘటనకు పాల్పడుతున్నారని ఫొటోలు, వివరాలతో వీటిని ముద్రించారు.
ఇల్లెందురూరల్: మర్రిగూడెం, పోలారం, పోచారం తండా, బోయితండా గ్రామపంచాయతీలలో శుక్రవారం మావోయిస్టు వ్యతిరేక వాల్‌పోస్టర్లు వెలిశాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ముత్వాయిలో మావోయిస్టుల దాడిలో గాయపడిన ముద్వినంద చిత్రాలు పోస్టర్లపై ఉన్నాయి. ప్రజాసంఘాలు స్పందించి నిజనిర్ధారణకు రావాలని గ్రామస్తులు, బంధుమిత్రుల పేరిట పోస్టర్లలో పేర్కొన్నారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన


హాజరైన విద్యార్థులు


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: జూలై 1 నుంచి కొత్త నేర చట్టాలు అమలులోకి వచ్చాయని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. స్థానిక సాధన జూనియర్ కళాశాలలో శుక్రవారం జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో నూతన నేర చట్టాలు, మాదకద్రవ్యాలు, మహిళల భద్రత, సీసీ టీవీ, ట్రాఫిక్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ... బ్రిటీష్ కాలం నుంచి అమలులో ఉన్న చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతన నేర చట్టాలను రూపొందించిందన్నారు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ), ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను మార్చి భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం చట్టాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. సీఆర్‌పీసీ స్థానంలో బీఎన్ఎస్ఎస్, ఐపీసీ స్థానంలో బీఎన్ఎస్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం చట్టాలు వచ్చాయన్నారు.

కొత్త మూడు చట్టాలు ఏ నేరాలకు వర్తిస్తాయో డీఎస్పీ వివరించారు. ఈ చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి కేసుల్లో ఇరుక్కోవద్దని, ఒక్కసారి కేసు నమోదు అయితే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్ బృందం తనిఖీ

జూలూరుపాడు: ఆపరేషన్ ముస్కాన్ బృందం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం వస్త్ర దుకాణాలు, నర్సరీల్లో తనిఖీ చేపట్టారు. బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారని తనిఖీలు నిర్వహించారు. జూలూరుపాడు గ్రామ శివారులోని ఓ మిర్చి నర్సరీలో పని చేస్తున్న బాలుడిని గుర్తించారు. అదేవిధంగా ఓ క్లాత్ స్టోర్స్‌లో సేల్స్ గర్ల్‌గా పని చేస్తున్న బాలికను గమనించారు. ఏన్కూర్ మండలం భీమ్లా తండాకు చెందిన మిర్చి నర్సరీ యజమాని, క్లాత్ స్టోర్స్ యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సిందిగా కొత్తగూడెం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ షరీఫుద్దీన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు జూలూరుపాడు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తిరుపతిరావు తెలిపారు.

వనమహోత్సవాన్ని వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున వనమహోత్సవం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నర్సరీలలో పెంచిన మొక్కలను నిర్దేశించిన ప్రాంతాలలో నాటేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ప్రాంతాలలో గుంతలు తవ్వే పనులు తక్షణం ప్రారంభించాలని చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీకి నిర్దేశించిన గడువులోగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. ఎంపీఓ చిరంజీవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శంకర్ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంపై మహిళలకు అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక

ఇల్లెందురూరల్: గొర్రెల పెంపకంపై అవగాహన పెంచుకుంటే లాభాలు గడించవచ్చని కొమరారం పశువైద్యాధికారి డాక్టర్ కార్తీక అన్నారు. కొమరారం రైతు వేదికలో నాబార్డ్ ఆధ్వర్యంలో గొర్రెల పెంపకంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. గొర్రెల పెంపకం జాగ్రత్తలతో కూడుకున్నదని, చిన్నపిల్ల స్థాయి నుంచి అనుక్షణం వాటి ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ సమయానుకూలంగా ముందులు అందించాల్సి ఉంటుందని చెప్పారు. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా వాటికి వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంరెడ్డి మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. శిక్షణ అనంతరం ఆసక్తి చూపిన మహిళలకు గొర్రెల పెంపకం కోసం రుణాలిచ్చి బ్యాంకులు సహకరిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఎంపీడీఓ ధన్‌సింగ్ మాట్లాడుతూ.. వ్యవసాయ పనులతో నిత్యం బిజీగా ఉండే మహిళలు వ్యవసాయేతర ఉత్పత్తులపై కూడా దృష్టిసారిస్తే ఆర్థిక ప్రగతి పొందవచ్చన్నారు. ఏడు రోజులపాటు నిర్వహించే శిక్షణ శిబిరంలో మహిళలు గొర్రెల పెంపకంపై సమగ్రంగా అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. సమావేశంలో సాయి స్వచ్ఛంద సంస్థ ఈడీ ఎడపాక వెంకన్న, చల్లసముద్రం పశువైద్యుడు డాక్టర్ రాజేష్, యూనియన్ బ్యాంకు మేనేజర్ బాలాజీ, ప్రోగ్రాం అధికారి శిరీష, కోఆర్డినేటర్ సైదులు, ఏపీఎం దుర్గారావు, సీసీలు కొమ్మాలు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయండి..

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీ షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరు సంవత్సరాలుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయని విమర్శించారు. మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఇప్పటికే బదిలీల ప్రక్రియ పూర్తయిందని, పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్ కూడా పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులకు కూడా పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్ల ప్రక్రియను ప్రారంభించి వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో సూపర్ న్యూమరీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఓ 317 ద్వారా మ్యూచువల్ బదిలీ అయిన వారికి బదిలీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు వాసం వరలక్ష్మి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు, బి.నర్సింహారావు, బి.మాన్‌సింగ్, వీరన్న, నాగునాయక్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను బతికించాలి

పాల్వంచరూరల్: నాటిన ప్రతీ మొక్కను బతికించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు అన్నారు. మండల పరిధి సూరారం గ్రామంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మడవి సరస్వతి కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ... రైతులకు ఆయిల్‌పామ్, పండ్లతోటల పెంపకం, మునగ, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి వాటికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం సహాయం చేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఓ బి.నారాయణ, పంచాయతీ ప్రత్యేకాధికారి దేవదాస్, ఏపీఓ పొరండ్ల రంగా, ఎంపీటీసీ శంకర్, కార్యదర్శులు మంగ, ఖాళీ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు


బీసీఎం రోడ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు


దూరంగా వేచి ఉన్న వాహనదారులు

పాల్వంచ: పోలీసులు వాహన చెకింగ్ చేపడుతుండటంతో వాహనదారులు వారికి చిక్కకుండా దూరంగా నిలిచి బారులు తీరుతుండటం పరిపాటిగా మారింది. వాహనానికి సంబంధించిన పత్రాలు, లైసెన్స్, హెల్మెట్ వంటివి ఏవీ లేకున్నా జరిమానా, వాహనాల సీజ్ నుంచి తప్పించుకునేందుకు చెకింగ్ ప్రదేశాలకు దూరంగా నిలిచిపోతున్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీఎం రోడ్‌లో ఎన్ఎండీసీ కర్మాగారం సమీపంలో పట్టణ ఎస్ఐలు బి.రాము, రాఘవయ్య తమ సిబ్బందితో వెహికిల్ చెకింగ్ చేపట్టారు. దీంతో కొత్తగూడెం నుంచి పాల్వంచకు వచ్చే పలు వాహనాలు పోలీసులకు చిక్కకుండా దూరంగానే ఉండిపోయారు.

దీంతో సుమారు అరకిలోమీటరు మేర వాహనాలు ఇలా రోడ్డు పక్కనే పార్కింగ్ చేసుకుని వేచి ఉన్నారు. పోలీసులు వెళ్లి పోయేవరకు ఎదురు చూశారు. ఒక్క వాహనం అయినా రాకపోతుందా అని పోలీసులు ఎదురు చూశారు. ఈ విషయమై ఎస్ఐ రామును వివరణ కోరగా... వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇలా ఇబ్బంది పడుతుంటారని, అన్ని పత్రాలతో వాహనాలు నడిపాలని కోరారు.

సింగరేణి కార్మికులకు భరోసా కల్పించాలి


దీక్షను ప్రారంభిస్తున్న మాజీ జీఎం ఆనందరావు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లు సింగరేణికే కేటాయించాలని, సింగరేణి, కార్మికుల మనుగడకు భరోసా ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ జీఎం పర్సనల్ అందెల ఆనందరావు అన్నారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలంపాటలను నిరసిస్తూ సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఒకరోజు నిరహార దీక్ష చేపట్టారు. శిబిరంలో కూర్చున్న వారికి పూల మాలలు వేసి, తాను కూడా దీక్షలో కూర్చున్నారు. మాట్లాడుతూ... సింగరేణిలో గతంలో 1.25 లక్షల కార్మికులు, సుమారు 68 బొగ్గు గనులు ఉండేవని, రానురాను ఈ గనుల శాతం తగ్గుముఖం పట్టి కార్మికుల సంఖ్య 39 వేలకు చేరిందన్నారు. ఈ క్రమంలో సింగరేణి గనులు వేలం పెట్టటం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సింగరేణి ప్రాంతంలోని గనులను సింగరేణికే కేటాయించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేసి, బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణాను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. సింగరేణి రిటైర్డ్ జీఎం పసుపులేటి శ్రీనివాసిరావు సంఘీబావం తెలిపారు. దీక్షలో ఏవీ రావు, బందెల విజేందర్, ఎస్.మధుసూదన్‌రావు, జి.చక్రపాణి, ఎం.శ్రీనివాస్, భద్రయ్య, ఈ.వెంకటేశ్వర్లు, ఆర్.సురేష్, ఎస్.శ్రీనివాస్, కుంచం వెంకటేశ్వర్లు, బి.రామారావు, ఎం.మురళీకృష్ణ, సీహెచ్.నాగరాజు, తోట రవి, జి.శ్రీనివాస్, ఈశ్వర్, కేశవరావు, మంద హనుమంతు, మీసాల మురళి, ఎస్.సుమన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని విరమించుకోండి..


సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న మద్దెల శివకుమార్



ఇల్లెందు: కొత్తగూడెం వెళ్తున్న ఏఐటీయూసీ నేతలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల వేలాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తోందని, ఇందులో భాగంగానే బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రకటించిందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగి మన తెలంగాణ రాష్ట్రంలో ఆరు జిల్లాలోని 11 ఏరియాల్లో విస్తరించి వేలాది మందికి ఉపాధి కల్పించే సిరులతల్లి సింగరేణిని పరిరక్షించుకునే బాధ్యాత ప్రతీఒక్కరి మీద ఉందన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు పోరాటాలు, దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయాన్ని మన్నించి వెంటనే మోది సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని విరమించుకోవాలని కోరారు. అల్లి శంకర్, తాండురు ధన్‌రాజ్, కలవల రాందాస్, మందా హనుమంతు, గుండా రమేష్, మందా వెంకన్న, స్టీవెన్ లాజరస్, ప్రతాప్, వంశీ, మహేష్ పాల్గొన్నారు.

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను బహిరంగ వేలం ద్వారా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కలెక్టర్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి నజీర్ అహ్మద్, దాసరి రాజారామ్, దేవరకొండ శంకర్ కోరారు. శుక్రవారం చలో కొత్తగూడెం కలెక్టరేట్ కార్యక్రమంలో పిలుపులో భాగంగా ఇల్లెందు నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ... కేంద్ర చర్యలను నిరసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, జయరాజ్, బాలాజీ, సత్యనారాయణ, వడ్ల శ్రీనివాస్, వలీ, చెరుకు సారయ్య, సాంబమూర్తి, తిరుమలరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.